క్లుప్తంగా

ఉత్సాహంగా యోగాంధ్ర వేడుకలు



12వ వార్డులో యోగాంధ్ర ర్యాలీ చేస్తున్న సచివాలయ సిబ్బంది, చిన్నారులు

ఆరిలోవ: నియోజకవర్గంలోని పలు వార్డుల్లో యోగాంధ్ర వేడుకలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. జీవీఎంసీ, సచివాలయాల సిబ్బంది, ఆర్పీలు, వార్డుల్లో స్థానికులకు యోగాపై అవగాహన కల్పిస్తున్నారు. జోన్–2 పరిధి 9, 10, 11, 12, 13 వార్డుల్లో సోమవారం యోగాంధ్ర వేడుకలు నిర్వహించారు. పిల్లలు, స్థానికులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా వార్డుల్లో ర్యాలీలు చేసి యోగా వల్ల కలిగే ఉపయోగాల గురించి సిబ్బంది తెలియజేశారు. యోగాతో ఆరోగ్యం పొందడంతోపాటు మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. ప్రతిరోజు దినచర్యలో భాగంగా యోగా చేయాలన్నారు. ఈ నెల 21న విశాఖలో జరగనున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆయా వార్డుల స్థానిక టీడీపీ నాయకులు, పలు కాలనీల సంఘాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన



20వ వార్డువాసులకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ ముువ్వల లక్ష్మి సురేష్

బీచ్‌రోడ్డు: ఈ నెల 21న ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంపై 20వ వార్డు ప్రజలకు కార్పొరేటర్ ముువ్వల లక్ష్మి సురేష్ అవగాహన కల్పించారు. సోమవారం వార్డులో అంతటా ఆమె పర్యటించి స్థానికులకు యోగా వల్ల కలిగే ఉపయోగాలు, యోగా దినోత్సవం రోజున జరగబోయే కార్యక్రమాల గురించి వివరించారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వతంత్రనగర్ పార్కు స్థలం కబ్జాపై ఫిర్యాదు

ఆరిలోవ: మధురవాడ ప్రాంతం స్వతంత్రనగర్‌లో బ్రహ్మంగారి ఆలయం వద్ద జీవీఎంసీ పార్కు స్థలాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని రూరల్ తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో తహసీల్దార్ పాల్‌కిరణ్‌కు ఆ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త చేకూరి రజని ఫిర్యాదు చేశారు. ఆక్రమించిన స్థలంలో చేపట్టిన నిర్మాణాలకు అక్రమ మార్గంలో పట్టాలు పొందారని, వాటిని ఇప్పుడు క్రమబద్ధీకరించుకోవడానికి సిద్ధమవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల మరో వ్యక్తి కూడా అక్కడ స్థలాన్ని ఆక్రమించి షెడ్ నిర్మించాడన్నారు. ఈ ఆక్రమణలపై తహసీల్దార్ దృష్టి పెట్టి నిర్మాణాలకు క్రమబద్ధీకరణ నిలిపివేయాలని ఆమె కోరారు.

ఈఏపీసెట్‌లో ఎసెంట్ సత్తా



గుల్లిపల్లి శివరామ్ నాయుడు

మద్దిలపాలెం: ఏపీఈఏపీ 2025 ఫలితాల్లో ఎసెంట్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సొంతం చేసుకున్నారని డైరెక్టర్ జి.నాగేశ్వరరావు తెలిపారు. తమ విద్యార్థి గుల్లిపల్లి శివరామ్‌నాయుడు 130వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. వెయ్యిలోపు 130, 229, 265, 271, 336, 447, 451, 485, 540, 568, 578, 760, 915 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. 38 మంది విద్యార్థులు 5వేల లోపు ర్యాంకులు సాధించారన్నారు. ఈ అద్భుత విజయం వెనుక తమ డైరెక్టర్లు, అధ్యాపక బృందం కృషి, పట్టుదల ఎంతగానో ఉన్నాయని జి.నాగేశ్వరరావు కొనియాడారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులందరినీ అభినందించారు.

భీమిలి డివిజన్ హౌసింగ్ ఈఈగా సూరిబాబు

ఎంవీపీకాలనీ: హౌసింగ్ కార్పొరేషన్ భీమిలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా కె.సూరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్యదర్శి కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సూరిబాబు ప్రస్తుతం టెక్కలి డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనతోపాటు మరో 10 మందికి డీఈఈల నుంచి ఈఈలుగా రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. 2024–25 ఏడాదికి సూరిబాబును డిప్యుటేషన్‌పై భీమిలి డివిజన్ ఈఈగా నియమించారు.

సమస్యల స్వాగతం

- సాగర తీరంలో అధ్వాన పరిస్థితులు
- బీచ్ రోడ్డులో దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లు, గ్రానైట్ పలకలు
- వ్యర్థాలతో నిండిన డస్ట్ బిన్లు
- యోగా దినోత్సవం సమీపిస్తున్న వేళ.. కానరాని సుందరీకరణ పనులు



తీరంలో దెబ్బతిన్న గ్రానైట్ పలకలు



వర్టికల్ గార్డెన్‌లో ఎండిన మొక్కలు



సాగర తీరంలోని టీయూ 142 మ్యూజియం వద్ద అస్తవ్యస్తంగా ఎలక్ట్రికల్ పనులు

ఏయూక్యాంపస్: మరో పది రోజుల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరగనుంది. ఈ ఏడాది ఈ వేడుకలను విశాఖ సాగర తీరం వేదికగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ సైతం రానున్నారు. అంతర్జాతీయంగా విశాఖకు గుర్తింపును తీసుకొచ్చే ప్రతిష్టాత్మక కార్యక్రమంగా ఇది నిలవనుంది. ఇంతటి ప్రాధాన్యం గల యోగా డే వేడుక నిర్వహించే సాగర తీరంలో పలు సమస్యలు తిష్ట వేశాయి. ఆర్.కె.బీచ్ నుంచి వీఎంఆర్‌డీఏ స్మార్ట్ సిటీ పార్క్ వరకు వెళ్లే రహదారిని సుందరంగా తీర్చిదిద్దాల్సి ఉంది. బీచ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు, ఇతర దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేయడం, రంగులు వేసి సుందరంగా తయారు చేయడం వంటివి చేయాల్సి ఉంది. ఈ దిశగా అధికారులు పనులు ప్రారంభించలేదు. వేడుక సమీపిస్తున్న నేపథ్యంలో తూతూ మంత్రంగా పనులు జరిపితే సమయం, ప్రజాధనం వృథా అయ్యే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి.

శిథిలమైన ఫుట్‌పాత్‌లు, పలకలు

ప్రధానంగా బీచ్ రోడ్డులో శిథిలమైన ఫుట్‌పాత్‌లకు, తీరం వైపు సందర్శకులు కూర్చునే గ్రానైట్ పలకలకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. విక్టరీ ఎట్ సీ నుంచి ఆర్.కె.బీచ్ వరకు ఉన్న ఫుట్‌పాత్ పలుచోట్ల గుంతలు పడటం, పైనుండే పలకలు దెబ్బతినడం, ఊడిపోవడం జరిగాయి. వీటిని బాగుచేయడం లేదా కొత్తవి నిర్మించడం చేయాలి.

కానరాని విద్యుద్దీకరణ

బీచ్ రోడ్డులో ఉన్న ఆకుపచ్చని ప్రాంగణాలు, మహనీయుల విగ్రహాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించాలి. ప్రస్తుతం కొన్ని చోట్ల మహనీయుల విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన దీపాలు వెలగడం లేదు. వీటిని పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టడం, కొత్తవి ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. లాన్‌లలో అదనపు విద్యుత్ లైట్లను అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి.

అస్తవ్యస్తంగా పనులు

ప్రస్తుతం విద్యుద్దీకరణ పనుల కోసం తవ్విన గోతుల్లో డెబ్రిస్ అక్కడే ఉంది. ఇంకా తొలగించలేదు. లాన్‌లలో విద్యుత్ తీగలు వేయడానికి తవ్విన తరువాత మట్టిని సక్రమంగా పరచడం లేదు. విద్యుత్ లైన్ల కోసం తవ్విన ప్రాంతంలో లాన్‌లో గడ్డి దెబ్బతింటోంది. వీటి స్థానంలో కొత్త లాన్ గడ్డిని పరచడం లేదు.

దుర్గంధభరితం

సాగర తీరంలోని పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. బీచ్ రోడ్డులోని డస్ట్ బిన్ల నిండా వ్యర్థాలు, ఫుట్‌పాత్‌లపై తిని పడేసిన ఆహార పదార్థాల డబ్బాలు, కవర్లు దర్శనమిస్తున్నాయి. మిగిలిన ఆహారాన్ని తినడానికి కుక్కలు, కాకులు ఈ కవర్లను ఫుట్‌పాత్‌లపై లాగి పడేస్తున్నాయి. సుందరమైన సముద్ర తీరాన్ని చూసేందుకు వస్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు.

జీవం కోల్పోయిన మొక్కలు

పాండురంగా పురంలో ఏర్పాటు చేసిన వర్టికల్ గార్డెన్‌లో మొక్కలు చనిపోవడంతో నిరుపయోగంగా మారింది. వీటిలో మొక్కలు నాటి, నీటి సరఫరా చేస్తే సుందరంగా దర్శనమిస్తుంది. జీ–20 సదస్సు సమయంలో ఏర్పాటు చేసిన వీటిని తరువాతి కాలంలో పట్టించుకోలేదు. ప్రస్తుతం వీటికి పునరుజ్జీవనం తీసుకొచ్చే దిశగా చర్యలు తీసుకోవాలి. బీచ్ రోడ్డులో డివైడర్ల మధ్యలో నాటిన మొక్కలు సైతం కొన్నిచోట్ల జీవం కోల్పోయాయి. వీటి స్థానంలో కొత్తవి నాటాల్సిన అవసరముంది. అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతమయ్యే దిశగా అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని పలువురు నగరవాసులు, సందర్శకులు కోరుతున్నారు.

మహనీయుల విగ్రహాలు వెలవెల



పక్షుల వ్యర్థాలతో నిండిన విగ్రహం

సాగర తీరం పొడవునా ఉన్న మహనీయుల విగ్రహాలను శుభ్రం చేయడం, రంగులు వేయడం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. ఈ విగ్రహాల చుట్టూ ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేస్తూ, అవసరమైన చోట మొక్కలు నాటాలి. తీరంలో ఉన్న పలు బొమ్మలకు సైతం రంగులద్దాల్సిన అవసరం ఉంది.



బీచ్ రోడ్డులో కుంగిన ఫుట్‌పాత్



ఫుట్‌పాత్‌పై శిథిలమైన పలకలు



పాండురంగాపురం సమీపంలో తొలగించని డెబ్రిస్

మంత్రి దృష్టికి అతిథి అధ్యాపకుల సమస్యలు



మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి వినతిపత్రం అందిస్తున్న అతిథి అధ్యాపకులు

మద్దిలపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా అతిథి అధ్యాపకులందరికీ ఒకే రకమైన జీతభత్యాలు చెల్లించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని అతిథి అధ్యాపకుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ అతిథి అధ్యాపకుల సమస్యలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోనూ గెస్ట్ లెక్చరర్లకు నెలవారీ జీతాలు ఇస్తున్నారని మంత్రి దృష్టికి అతిథి అధ్యాపకులు తీసుకెళ్లారు. జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులకు రూ.27 వేల జీతం పెంచాలని కోరారు. పర్ సెమిస్టర్ పర్ పేపర్ రూ.45,000 ఇస్తున్నారని, దీనిలో 10 శాతం టీడీఎస్ రూపంలో కట్ చేస్తున్న సంగతిని మంత్రికి వివరించారు. సుమారుగా నెలకు రూ.7,500 మాత్రమే వస్తున్నాయన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో నోటిఫికేషన్, ఇంటర్వ్యూ లేకుండా బ్యాక్ డోర్ ద్వారా అనేక మంది ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అటువంటి వాళ్లందరినీ కూడా వెనక్కి పంపాలని కోరారు. డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ దాస్, డాక్టర్ శిరీష్, డాక్టర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ సీఈఏ డిప్యుటేషన్ పొడిగింపు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్(సీఏవో) వి.హరిప్రసాద్ డిప్యుటేషన్ మరో ఏడాది పొడిగించారు. ఈ మేరకు ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఆడిట్ శాఖ డీడీగా ఉన్న హరిప్రసాద్‌ను ఏడాది క్రితం డిప్యుటేషన్‌పై వీఎంఆర్‌డీఏ సీఏఓగా నియమించారు. తాజాగా ఆయన డిప్యుటేషన్ కాలాన్ని 2026, మార్చి 12వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

అంబరాన్నంటిన తొలేళ్ల సంబరం

- ఇసుకతోట కనకదుర్గమాంబకు విశేష పూజలు
- నేడు అనుపు ఉత్సవం



నృత్యంతో అలరిస్తున్న కళాకారులు



అమ్మవారి రూపంలో విద్యుద్దీపాలంకరణ



తొలేళ్ల సంబరంలో సంప్రదాయ నృత్య ప్రదర్శనలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో కొలువైన శ్రీ కనకదుర్గమాంబ, నెల్లి పోలమాంబ, ఎర్నిమాంబ అమ్మవార్ల వార్షిక పండగ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు సోమవారం తొలేళ్ల సంబరం అంబరాన్నంటింది. అమ్మవారికి ఉదయం నుంచి అర్చకులు, భక్తులు విశేష కుంకుమ పూజలు, లలిత సహస్రనామ పారాయణం చేశారు. గుర్రపు స్వారీలు, తప్పెట గుళ్లు, కోలాటం, నేలవేషాలు, నృత్యాలు మొదలగు సంప్రదాయ ప్రదర్శనలు గ్రామ పురవీధుల్లో కళాకారులు నిర్వహించి అలరించారు. వీటిని తిలకించడానికి అధిక సంఖ్యలో స్థానికులు తరలివచ్చారు. తొలేళ్ల ఉత్సవంలో రాత్రి ఏర్పాటు చేసిన బుర్రకథ ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని శ్రీకృష్ణా ఉమా మహేశ్వర సాయిదుర్గా యాదవ సేవా సంక్షేమ సంఘం, ఉత్సవ కమిటీ ప్రతినిధులు గొలగాని అప్పారావు, బొట్ట శివ, ఈగల సత్యం, ఒమ్మి శ్రీనివాసరావు, పల్ల అప్పారావు, ప్రసాది అప్పారావు, ఒమ్మి గోపీకృష్ణ తెలిపారు. మంగళవారం అమ్మవారి అనుపు ఉత్సవం భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవ ప్రతినిధులు గొలగాని అప్పలరాజు, గొలగాని రామచంద్రరావు, ముువ్వల శ్రీను, ముగడ శేఖర్, ఈగల రమణ, ఈగల గోపి, ఒమ్మి గోపినాథ్, పల్ల శివ, కాకర రాము, ఒమ్మి రాజశేఖర్, ప్రసాది వినోద్, ఉప్పిలి కృష్ణంనాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అధిక ఫీజుల వసూళ్లపై ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా



ఇంపల్స్ కళాశాల వద్ద ఆర్‌ఐవో మురళీధర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మద్దిలపాలెం: సిరిపురంలోని ఇంపల్స్ జూనియర్ కాలేజీ వద్ద పుస్తకాలు, యూనిఫారాలను అక్రమంగా అమ్మడమే కాకుండా, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంపల్స్ కాలేజీ వద్ద ధర్నా నిర్వహించామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు జి.అజయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ బోర్డు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయల అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. వేలాది రూపాయలకు పుస్తకాలు, యూనిఫారాలు, ఇతర మెటీరియల్స్ అక్రమంగా విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ అక్రమ కార్యకలాపాలపై విద్యా శాఖ తక్షణమే చర్యలు చేపట్టాలని, విద్యా శాఖ మంత్రి చొరవ చూపాలని కోరారు. ఈ నిరసనకు స్పందించిన ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్‌ఐవో) మురళీధర్ ఇంపల్స్ కళాశాల వద్దకు వచ్చి అక్రమంగా విక్రయిస్తున్న పుస్తకాలను సీజ్ చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కళాశాలలో జరుగుతున్న అక్రమాలపై వినతిపత్రం అందజేసినట్లు అజయ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.వెంకటరమణ, జి.రాము, ఇతర నాయకులు కౌశిక్, శశి కుమార్, కుసుమంజలి, మౌనిక, ప్రగతి, కావ్య, విద్యార్థి కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌పై దిశానిర్దేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఈడీ సత్యపద్మ, జెడ్పీ శివప్రసాద్, అధికారులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో సోమవారం స్వర్ణాంధ్ర విజన్–2047పై వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా సీఎం చంద్రబాబు 175 నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం తూర్పు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ స్పెషల్ ఆఫీసర్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ మాట్లాడుతూ నియోజకవర్గాల అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, సహజ వనరులపై దృష్టి వంటి అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ఆయా అంశాల్లో నియోజకవర్గాలను అభివృద్ధి దిశగా నడిపించేందుకు అవసరమైన నిర్దిష్ట ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ శివప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

- జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకుడు గోపినాథ్



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఎస్జీటీ ఉపాధ్యాయులు

బీచ్‌రోడ్డు: సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీలు)కు మాన్యువల్ పద్ధతిలోనే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని విశాఖ జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకుడు డి.గోపినాథ్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉపాధ్యాయులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి గోపినాథ్ మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పించాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 2,500 నుంచి 3,000 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుత వెబ్ కౌన్సెలింగ్ విధానంలో ఒక్కో ఉపాధ్యాయుడు నెట్ సెంటర్‌కు వెళ్లి వేల సంఖ్యలో వెబ్ ఆప్షన్లు నమోదు చేయడం కష్టసాధ్యంగా మారిందన్నారు. అన్ని ప్రాంతాలపై పూర్తి అవగాహన లేకపోవడంతో ఎక్కడికి బదిలీ అవుతామోనని ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే మాన్యువల్ కౌన్సెలింగ్ అయితే ఖాళీగా ఉన్న పాఠశాలలను చూసి.. తమకు నచ్చిన స్థానాన్ని ఎంపిక చేసుకునే సౌలభ్యం ఉంటుందని వివరించారు. విజయవాడలో జరగనున్న 'విద్యాభవన్'ముట్టడికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. నాయకులు టి.రామకృష్ణ, జి.చిన్నబ్బాయి, ఆరుద్ కుమార్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా శిక్షణలో ఇగ్నో కీలకం



ఇగ్నో అధ్యాపకులతో విద్యా శాఖ ఆర్థిక సలహాదారు మృత్యుంజయ బెహరా

ఎంవీపీకాలనీ: నైపుణ్యం, వృత్తి విద్యా శిక్షణలో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) పాత్ర కీలకమని కేంద్ర విద్యా శాఖ ఆర్థిక సలహాదారు మృత్యుంజయ బెహరా పేర్కొన్నారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన సోమవారం ఎంవీపీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయంలో ఇగ్నో ద్వారా అందిస్తున్న కార్యక్రమాలను సమీక్షించారు. విద్యార్థులకు ఇగ్నో అధ్యయన కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. నగరంలోని పలు సెంటర్లను సందర్శించిన మృత్యుంజయ బెహరా అక్కడ సౌకర్యాలపై ఆరా తీశారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సుల నిర్వహణ, ప్రయోగ పరీక్షలు, విద్యార్థులను ఆస్పత్రులతో అనుసంధానం చేస్తూ అందిస్తున్న శిక్షణల గురించి తెలుసుకున్నారు. ఇగ్నో అధ్యాపకులతో సమావేశమై జాతీయ విద్యా విధానంలో కళాశాలల పాత్రను విశదీకరించారు. కార్యక్రమంలో ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పాములకు నిలయంగా అతిథి గృహం



ముడసర్లోవ పార్కులో శిథిలావస్థకు చేరిన అతిథి గృహం

ఆరిలోవ: స్థానిక ముడసర్లోవ పార్కులోని అతిథి గృహం నిరుపయోగంగా మారింది. ఒకప్పుడు అతిథులు సేదదీరే ఈ భవనం ఇప్పుడు పాములకు నిలయంగా మారింది. పార్కులో 1991లో జీవీఎంసీ నిర్మించిన ఈ గృహం కొన్నేళ్ల కిందటే శిథిలావస్థకు చేరడంతో అతిథులకు దూరమైంది. దీంతో ఈ భవనాన్ని ముడసర్లోవ నీటి సరఫరా విభాగానికి చెందిన నీటి పైపులు, పనిముట్లకు గొడౌన్‌గా వినియోగించుకుంటున్నారు. వాటిలో విషసర్పాలు చేరిపోతున్నాయి. పార్కుకు వెళ్లే సందర్శకులకు తరచూ ఇవి కంటపడుతున్నాయి. దీంతో సందర్శకులు భయంతో పరుగులు తీస్తున్నారు. అతిథి గృహానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొస్తే ఈ సమస్య పరిష్కారమవుతుందని సందర్శకులు సూచిస్తున్నారు.